నిట్‌లో ప్రపంచ ఆహార దినోత్సవం

మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 16 : వరంగల్ నిట్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సహకారంతో 'ఫంక్షనల్ ఫుడ్స్ అండ్ స్మార్ట్ ప్రొటీన్స్: ఫ్యూచర్ ఆఫ్ న్యూట్రిషన్' అనే థీమ్‌తో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. నిట్ బయోటెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ రామరాజు ఆహార వ్యవస్థల్లో ఆవిష్కరణల ప్రాముఖ్యత, ఆహార భద్రత సుస్థిరతను నిర్ధారించడంలో బయోటెక్నాలజీ పాత్రను వివరించారు. తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్(టీఏఎస్) జోనల్ కోఆర్డినేటర్ లక్ష్మారెడ్డి టీఏఎస్ చరిత్ర, దార్శనికత, లక్ష్యం.. ఈ ప్రాంతంలో ఆహార సంబంధిత సవాళ్లను పరిష్కరించడానికి విద్యాపరమైన సహకారం అవసరాన్ని చెప్పారు. ఫుడ్ బయోటెక్నాలజీలో పరిశోధనను ముందుకు తీసుకెళ్లేందుకు ఇన్‌స్టిట్యూట్ నిబద్ధతతో పాటు ప్రజారోగ్యంపై దాని ప్రభావం గురించి ప్రొఫెసర్ శిరీష్ సోనావానే ప్రసంగించారు. నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి తన ప్రసంగంలో ఆహారాన్ని వృథా చేయడం, పోషకాహారం, ఆహార భద్రత, స్థిరమైన ఆహార పద్ధతుల గురించి చెప్పారు.

పారిశుధ్య కార్మికులతో వ్యక్తి దురుసు ప్రవర్తన

సీఐటీయూ ఆధ్వర్యంలో హసన్‌పర్తిలో రాస్తారోకో

రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ, పారిశుధ్య కార్మికులు

హసన్‌పర్తి, అక్టోబర్ 16: మండల కేంద్రంలోని దళిత పారిశుధ్య కార్మికులను దూషించిన గాంధీనగర్‌కు చెందిన చెన్నూరి శ్రీనివాస్‌ను వెంటనే అరెస్ట్ చేసి, అతడిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య ఆధ్వర్యంలో హసన్‌పర్తిలో జాతీయ రహదారిపై బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న పారిశుధ్య పనులు చేస్తుండగా, శ్రీనివాస్ వారిని దూషించాడని, దీంతో కార్మికులు జవాన్ నాగరాజుకు ఫిర్యాదు చేశారన్నారు. జవాన్ నాగరాజు 15వ తేదీన శ్రీనివాస్‌ను నిలదీయగా, అతడినీ దూషించినట్లు చెప్పారు. గతంలోనూ పారిశుధ్య కార్మికులు, జవాన్‌ను శ్రీనివాస్ తిట్టగా అతడికి జరిమానా కూడా విధించినట్లు తెలిపారు. అయినా తీరు మార్చుకోకుండా పారిశుధ్య కార్మికులతో దురుసుగా ప్రవర్తించిన శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేశ్, మండల కార్యదర్శి అశోక్, నాగరాజు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నాకుయింటయిన గోలి సౌమ్య గారి తండ్రియైన గోలి ప్రతాప్‌రెడ్డి గారికి వారసత్వంగా సంక్రమించినటువంటి ఇ.నెం. 1-34/2/3 గల ఇల్లు ఇతర కుటుంబ సభ్యుల మోసపూరితమైన మాటలను నమ్మివారి పేరున రిజిస్ట్రేషన్ చేయుటకు సమాయత్తమైనట్టు నిర్దిష్టమైన సమాచారం ఉన్నందున ఈ పత్రికా ప్రకటన చేయనైనది. కావున సమస్త ప్రజానీకానికి హెచ్చరించునది ఏమనగా, మరియాపురం, ఊకల్లు గ్రామంలోని ఇ.నెం. 1-34/2/3 గల ఇల్లును ఎవరుగాని కొనుగోలు చేయవద్దని, గ్రామపంచాయతీ రికార్డులలో మార్పు చేసుకోకూడదని తెలియజేయనైనది. ఒకవేళ ఏలాంటి లావాదేవీలు చేసినా వారే చట్టరీత్యా భాధ్యులౌతారని తెలియజేయనైనది.
జనగామ, తేది. 16-10-2024
ఇట్లు **చిలువేరు సుధీరంజన్** అడ్వకేట్,
ఇ.నెం. 1-2-349/B, జనగామ.
సెల్: 9849425165

స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 16: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండలోని జూనియర్ కాలేజీ జంక్షన్‌లో విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో రూ.8వేల కోట్ల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో మూడేళ్లుగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు బంద్ పెట్టడం వల్ల విద్యార్థులు అయోమయంలో పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పవన్‌కుమార్, అభిషేక్, ప్రదీప్, సాయి, సందీప్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలి

- కలెక్టర్ ప్రావీణ్య
- అట్టహాసంగా సీఎం కప్ టార్చ్ రిలే
- పాల్గొన్న వరంగల్ కలెక్టర్ సత్యశారద, పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, సీపీ అంబర్ కిశోర్ ఝా

ర్యాలీలో పాల్గొన్న క్రీడాకారులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 16 : గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడల్లో విద్యార్థులు, యువత రాణించాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బుధవారం వేయిస్తంభాల ఆలయం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు పల్లెల నుంచి ప్రపంచ స్థాయి చాంపియన్లుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సీఎం కప్-2024 టార్చ్ రిలే ర్యాలీని వరంగల్ కలెక్టర్ సత్యశారద, సీపీ అంబర్ కిశోర్‌ఝాతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. త్వరలో ప్రారంభమయ్యే సీఎం కప్ పోటీల్లో క్రీడాకారులు రాణించి రాష్ట్రంలోనే హనుమకొండను నంబర్‌వన్‌గా నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు. సీపీ మాట్లాడుతూ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తున్నదని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీవైఎస్‌వో గుగులోత్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రతిభ ఉండి ప్రోత్సాహం కరువై మట్టిలో మాణిక్యాలుగా మిగిలిపోతున్న క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావాలన్న సంకల్పంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారులు పలు గీతాలను ఆలపించి ఆకట్టుకున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ అధికారులు గోకుల్, మధు, రతన్‌బోస్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగి మృతి

సారయ్య(ఫైల్)

కమలాపూర్, అక్టోబర్ 16: మండలంలోని ఉప్పల్ గ్రామానికి చెందిన ఐటీడీఏ రిటైర్డ్ ఉద్యోగి కెంసారపు సారయ్య (65) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. సారయ్య కుమారుడు ప్రసాద్ చెన్నైలో సీబీఐ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. దసరా పండుగకు ప్రసాద్ స్వగ్రామానికి వచ్చాడు. పండుగ ముగియడంతో తండ్రి సారయ్యతో కలిసి కారులో చెన్నైకి బయలు దేరారు. ఈ క్రమంలో నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులో ఉన్న సారయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు ప్రసాద్‌కు తీవ్రగాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వృద్ధురాలి ఆత్మహత్య

హసన్‌పర్తి, అక్టోబర్ 16 : పురుగుల మందు తాగి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. సీఐ చేరాలు కథనం ప్రకారం.. మండలంలోని నాగారానికి చెందిన పబ్బా రాజేశ్వరి (80) పదేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతుండేది. నాలుగేళ్ల క్రితం రాజేశ్వరి భర్త మృతి చెందాడు. ఈ క్రమంలో ఆమె మానసిక వేదనతో బుధవారం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమారుడు రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు

భీమదేవరపల్లి, అక్టోబర్ 16 : పిచ్చికుక్క దాడిలో పలువురు గాయపడిన ఘటన ముల్కనూరులో బుధవారం జరిగింది. మార్కెట్ సమీపంలో దొండ మహేందర్, గుడికందుల రమేశ్, మాడుగుల పోచవ్వ, గొర్రె లక్ష్మిపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది అక్కడికి చేరుకుని వారికి చికిత్స చేశారు. అలాగే, గొల్లపల్లిలో ఒడ్డేపల్లి లక్ష్మి, ఇనుగాల ఓదెమ్మ, సంగ కోమల సైతం పిచ్చికుక్క దాడిలో గాయపడినట్లు 108 సిబ్బంది రవి, సంపత్ తెలిపారు.

34 లీటర్ల గుడుంబా స్వాధీనం

ఆత్మకూరు, అక్టోబర్ 16 : వాహనంపై గుడుంబాను తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ సంతోశ్‌కుమార్ బుధవారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన పాండవుల అర్జున్ములుగు జిల్లా రాంనర్ ప్రాంతానికి చెందిన బాలు వద్ద 34 లీటర్ల గుడుంబా కొనుగోలు చేశాడు. ఎక్సెల్ వాహనానికి గోనె సంచి అమర్చి అందులో పాత పత్తి వేసి మధ్యలో గుడుంబాను 17 ప్లాస్టిక్ కవర్స్‌లో నింపి ఎవరికీ అనుమానం రాకుండా తరలిస్తున్నాడు. ఆత్మకూరు శివారులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. గుడుంబా, వాహనాన్ని స్వాధీనం చేసుకుని అర్జున్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు ఆర్టిజన్స్ మహా ధర్నా

హనుమకొండ, అక్టోబర్ 16 : విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్స్ గురువారం నక్కలగుట్టలోని టీజీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీసు ఎదుట మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ ఫైనాన్స్ సెక్రటరీ సదానందం ఒక ప్రకటనలో తెలిపారు. తమను పర్మినెంట్ చేయాలని సుమారు 15,000 మంది కార్మికులతో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి

అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హనుమకొండ, అక్టోబర్ 16 : జిల్లాలో వానకాలం సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద దొడ్డు, సన్న రకం ధాన్యానికి సంబంధించి కనీస మద్దతు ధర తెలిపేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రెండు రకాల ధాన్యం కొనుగోలుకు వేర్వేరు కేంద్రాలను నిర్వహించాలన్నారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500లను బోనస్ ప్రకటించిందని, వాటి కొనుగోలులో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. సన్న రకం ధాన్యాన్ని గుర్తించేందుకు కొనుగోలు కేంద్రాల్లో డిజిటల్ మైక్రో కాలిపర్స్, ప్యాడీ క్లీనర్స్, డ్రయ్యర్స్‌ను అందుబాటుతో ఉంచాలన్నారు. సన్న రకం ధాన్యం నింపే కొత్త సంచులను తిరగేసి ధాన్యం నింపిన అనంతరం వాటికి సంబంధించిన వివరాలను సంచులపై ఎస్ గుర్తుతో పాటు సెంటర్ నంబర్ వేయాలన్నారు. వ్యవసాయ అధికారులు అందించిన టోకెన్ ఆధారంగానే ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీసీఎస్‌వో ఉమారాణి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం మహేందర్, జిల్లా సహకార అధికారి నీరజ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ జేడీ రవీందర్ సింగ్, జిల్లా మార్కెటింగ్ అధికారి అనురాధ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి

జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగ పద్మజ

సమీక్షిస్తున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగపద్మజ

ఆత్మకూరు, అక్టోబర్ 16 : మండలంలోని గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగపద్మజ ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాబోయే సంవత్సరానికి నర్సరీల ఏర్పాట్లకు సిద్ధంగా ఉండాలన్నారు. టార్గెట్ ప్రకారం మట్టి తెప్పించుకొని బ్యాగులను నింపాలన్నారు. వ్యక్తిగత మరుగు దొడ్లు, ఇంకుడు గుంతలు, డ్రైనేజీలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో రాజిరెడ్డి, ఈసీ రాము పాల్గొన్నారు.

కిటికీ అద్దాలు ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

హసన్‌పర్తి, అక్టోబర్ 16 : ఇంటి కిటికీ అద్దాలు ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. సీఐ చేరాలు కథనం ప్రకారం.. ముచ్చర్లకు చెందిన ఆకుల రాజేశ్ తన జన్మదినం సందర్భంగా గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకున్నాడు. కాగా, ఈ ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చింపివేశారు. ఫ్లెక్సీని ఇదే గ్రామానికి చెందిన చిర్ర సంపత్‌కుమార్ చింపేశాడనే అనుమానంతో మంగళవారం గ్రామంలోని ఓ వ్యక్తి ద్వారా పిలిపించి పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకుందామని చెప్పగా సంపత్‌కుమార్ వెళ్లలేదు. అదే రోజు రాత్రి 8గంటల సమయంలో రాజేశ్ కోపంతో సంపత్‌కుమార్ ఇంటికి వచ్చి కిటికీ, వెంటిలేటర్ అద్దాలను పగుల గొట్టాడు. దీంతో సంపత్‌కుమార్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చే సరికి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సంపత్‌కుమార్ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నేతలు

శాయంపేట, అక్టోబర్ 16 : మండలంలో పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ నేతలతో కలిసి బుధవారం పరామర్శించారు. సాధనపల్లి గ్రామ అధ్యక్షుడు సమ్మయ్య తల్లి సాంబలక్ష్మి దశదినకర్మకు హాజరయ్యారు. శాయంపేట మాజీ సర్పంచ్ వలుపదాసు చంద్రమౌళి ఇటీవల గుండె ఆపరేషన్ చేసుకోగా ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గజ్జల లావణ్య-రాజు, పొడమేకల మమత-సంపత్, అరికిల్ల ప్రసాద్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మారెపల్లి నందం, గ్రామ అధ్యక్షుడు గాజె రాజేందర్, కరుణ్ బాబు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఆత్మకూరు/నడికూడ, అక్టోబర్ 16 : కామారం గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 5 క్వింటాళ్ల 40 కిలోల రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఏఎస్సై గోవర్ధన్ తెలిపారు. గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి చిరంజీవి పీడీఎస్ బియ్యాన్ని గ్రామస్తుల వద్ద నుంచి కొనుగోలు చేసి, ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఇంటిపై దాడులు చేసి 5 క్వింటాళ్ల 40 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. చిరంజీవిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు. అలాగే నడికూడ మండలంలోని కంఠాత్మకూర్ గ్రామానికి చెందిన బాయి కుమారస్వామి, పల్లెబోయిన అంజలి అక్రమంగా నిల్వ చేసిన 16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.41,600 ఉంటుందనారు. బాయ్యాన్ని దామెర పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడి అదృశ్యం

హసన్‌పర్తి, అక్టోబర్ 16 : యువకుడి అదృశ్యం అయిన ఘటన హసన్‌పర్తిలో జరిగింది. సీఐ చేరాలు కథనం ప్రకారం.. వరంగల్ పిన్నావారి స్ట్రీట్‌కు చెందిన జోగావత్ రాజేశ్ (26) ఆరు నెలల నుంచి హసన్‌పర్తి లోని ఆశీర్వాద్ పైపుల కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం తన అన్న గోపాల్‌కు ఫోన్ చేసి ఇంటికి వస్తానని చెప్పాడు. కాసేపటికి మళ్లీ ఫోన్ చేసి రానన్నాడు. అలాగే ఫోన్‌పేలో డబ్బులు పంపిస్తా అన్నాడు. కాసేపటి తర్వాత గోపాల్ ఫోన్ చేస్తే రాజేశ్ ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. గోపాల్ రాజేశ్ యజమానికి ఫోన్ చేయగా ఇంటికి వెళ్తానని చెప్పాడని సమాధానం ఇచ్చాడు. దీంతో బంధువుల ఇళ్లల్లో, చుట్టుపక్కల వారి వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. బుధవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'ఎల్ఆర్ఎస్' పరిశీలన పారదర్శకంగా ఉండాలి

మేయర్ గుండు సుధారాణి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్, అక్టోబర్ 16 : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బుధవారం కార్పొరేషన్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలనపై వార్డు అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. గ్రేటర్‌లో 12 బృందాలను ఏర్పాటు చేసి ఈ ప్రక్రియ చేపట్టినప్పటికీ ఆశించిన మేరకు అధికారులు భాగస్వామ్యం కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం 80 వేల దరఖాస్తులు పరిశీలించాలన్నారు. ఒక్కో వార్డు అధికారి 1400 దరఖాస్తులను వెరిఫికేషన్ చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పర్యవేక్షణ కోసం ప్రత్యేకాధికారులను నియమిస్తామన్నారు. వార్డు అధికారులకు కౌన్సిల్ హాల్‌లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాదేకర్, కార్యదర్శి విజయలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, టీపీఎస్ ఇర్షాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూళ్ల లక్ష్యాన్ని సాధించాలి

నగరంలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూళ్ల లక్ష్యాన్ని సాధించాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. బల్దియా కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి ఆమె ట్రేడ్ లైసెన్స్, పారిశుధ్య నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.11 కోట్లు ఉండగా రూ.3కోట్లు మాత్రమే వసూలయ్యాయన్నారు. నగరంలో పారిశుధ్య వాహనాలను ఐసీసీసీకి వెంటనే అనుసంధానం చేయాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ట్రేడ్ లైసెన్స్‌తో పాటు ఆస్తి, నల్లా పన్నులను కూడా వసూలు చేయాలన్నారు. సమావేశంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజిరెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. అలాగే, ఇందిరా మహిళా శక్తి పథకంపై బ్యాంకర్లు, మెప్మా అధికారులతో సమీక్ష నిర్వహించారు. పథకంలో భాగంగా మహిళా సంఘాలకు జాప్యం లేకుండా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలన్నారు. నగర పరిధిలో 215 యూనిట్ల ఏర్పాటు లక్ష్యం కాగా 48 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో వరంగల్, హనుమకొండ ఎల్‌డీఎంలు రాజు, శ్రీనివాస్, ఏపీజీవీబీ ఆర్ఎం చైతన్య, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, డీఎంసీలు రజితరాణి, రేణుక, టీఎంసీ రమేశ్, సీవోలు పాల్గొన్నారు.

మేయర్‌కు ఉత్సవ కమిటీ వినతి..

దీపావళి పండుగ సందర్భంగా ఉర్సు రంగలీలా మైదానంలో నిర్వహించే నరకాసుర వధ ఉత్సవానికి బల్దియా ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేయాలని కోరుతూ మేయర్ సుధారాణిని కార్పొరేషన్‌లో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి నేతృత్వంలో ప్రతినిధులు కలిశారు. 30న నరకాసుర వధ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎల్ఈడీ స్క్రీన్లు, తాగునీటి వసతి కల్పించాలని, పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. ఆవునూరి రామ్మూర్తి, గౌతమ్, దూడె కొమురెల్లి, మిర్యాల ఆదిత్య, కుండే రాజు, మరుపల్ల శివ, తౌటం నరసింహ, గౌడ రాము, కొమ్ము రాజు, కుండె కుమార్ ఉన్నారు.

'నైతిక విలువలకు కట్టుబడిన రతన్‌టాటా'

నివాళులర్పిస్తున్న సంస్థ బాధ్యులు

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 16 : నైతిక విలువలకు కట్టుబడిన వ్యక్తి రతన్‌టాటా అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కేయూ అర్థశాస్త్ర విభాగంలో బుధవారం వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు సురేశ్‌లాల్ అధ్యక్షతన రతన్ టాటా సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ బాధ్యులు మాట్లాడుతూ రతన్‌టాటా సమాజానికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. రతన్‌టాటాకు భారతరత్న ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక చైర్మన్ సిరాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి శ్రీపాద సుధాకర్‌రావు, పాలకమండలి సభ్యులు అనితారెడ్డి, కోశాధికారి పొడిచెట్టి విష్ణువర్ధన్, సంస్థ బాధ్యులు కొక్కొండ విజయబాబు, శనిగరపు రాజమోహన్, కాజీపేట పురుషోత్తం, నరసింహమూర్తి, విప్పనపల్లి రవికుమార్, అనసూరి చంద్రమౌళి, వెలాంగిణి, వెలుదొండి రవికుమార్, అశోక్, రావులకొలను రామ్మూర్తి, లక్ష్మీనారాయణ, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

అధికారులకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

కాజీపేట, అక్టోబర్ 16 : కాజీపేట రైల్వే సబ్ డివిజన్ పరిధిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల సర్వీస్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సికింద్రాబాద్ రైల్వే అసిస్టెంట్ పర్సనల్ అధికారి(ఏపీవో) జితేందర్ అన్నారు. కాజీపేటలోని రైల్వే కమ్యూనిటీ హాల్‌లో జనరల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో స్టాఫ్ గ్రీవెన్స్ క్యాంపు బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఉమ్మీద్ కార్డు, ఐడీ కార్డు, ప్రమోషన్ డ్యూ, సీనియార్టీ లిస్ట్, సర్వీస్ రికార్డు, ఫ్యామిలీ డిక్లరేషన్ మార్పులు, చేర్పులు తదితర సమస్యలపై రైల్వే కార్మికులు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వేలో కార్మికుల ఇబ్బందులను తీర్చేందుకు కాజీపేటలో స్టాఫ్ గ్రీవెన్స్ కార్యక్రమం చేపట్టామన్నారు. రైల్వే చీఫ్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్లు సరళ మాధవి, ఎన్‌వీ వీవీ రెడ్డి, ఎంఎంఎల్ ప్రసాద్, చీఫ్ ఓఎస్‌లు కోటేశ్వర్‌రావు, సురేశ్‌బాబు, సీనియర్ క్లర్క్ వికాస్‌కుమార్, రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, కోశాధికారి గిరిమిట్ల రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో హెల్త్‌క్యాంప్

భీమదేవరపల్లి, అక్టోబర్ 16 : మండలంలోని కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాలలో బుధవారం వంగర ప్రభుత్వ